## క్లుప్తంగా

### ఆలయానికి ఎమ్మెల్యే రూ.3 లక్షల విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**చెన్నేకొత్తపల్లి:** మండల కేంద్రంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పండుగ సందర్భంగా నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రూ.3 లక్షలు విరాళంగా అందజేశారు. బుధవారం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలయ కమిటీ సభ్యులకు ఆ మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనశ్రీ, వైస్ ఎంపీపీ పవన్‌కుమార్‌రెడ్డి, నాయకులు ఎస్‌టీడీ శ్రీనివాసరెడ్డి, గాలి తాతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కరపత్రాల విడుదల

**ధర్మవరం అర్బన్:** ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి రాయలసీమ జిల్లాల విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పోతలయ్య తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. మంత్రాలయంలో జూలై 3, 4, 5 తేదీల్లో మూడు రోజుల పాటు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు జగదీష్, పట్టణ నాయకులు జయవర్ధన్, యాసిన్, మురళి, చరణ్, గణేష్, మహేష్ పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

**ధర్మవరం అర్బన్:** రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికయ్యారని ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. ఈనెల 29 నుంచి జూలై 2వ తేదీ వరకు కృష్ణా జిల్లా నూజివీడులో జరిగే 8వ ఏపీ రాష్ట్ర జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టుకు ఎంపికైన కిరణ్మయి, సల్మా, తరుణ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా, కోచ్ సంజయ్ పాల్గొన్నారు.

### జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ



జిల్లా స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థినులు

**బత్తలపల్లి:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలపై జిల్లా స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో బత్తలపల్లి విద్యార్థినులు తృతీయ బహుమతి సాధించారు. బుధవారం పుట్టపర్తిలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. ఎస్.మదిహా, ఆఫ్రిన్ తృతీయ స్థానంలో నిలిచి, రూ.5 వేల నగదు బహుమతి స్వీకరించారు.

### ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం



విద్యార్థులకు బస్సు పాసులు అందజేస్తున్న డిపో మేనేజర్ ఇనయతుల్లా

**పుట్టపర్తి టౌన్:** పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయాలని డిపో మేనేజర్ ఇనయతుల్లా పేర్కొన్నారు. బుధవారం జగరాజుపల్లి ఏపీ మోడల్ స్కూల్‌లో 20 మంది పేద విద్యార్థులకు తన సొంత ఖర్చులతో ఉచితంగా బస్సు పాసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీపీటీఓ మధుసూదన్ ఆదేశాలతో విద్యార్థులకు అనుగుణంగా బడి బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు బస్సు పాసు సౌకర్యం కల్పించామన్నారు. ప్రైవేటు వాహనాలు ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసి సురక్షితంగా గమ్యాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమేష్‌బాబు, ఎస్టీఐ పెద్దన్న, సిబ్బంది శివశంకర్ పాల్గొన్నారు.

# మోసకారి బాబు మాటలు నమ్మొద్దు

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే డా.పి.వి సిద్దారెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



తలుపుల: లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి



ధర్మవరం రూరల్: సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

**తలుపుల:** మోసకారి చంద్రబాబు మాటలు నమ్మొద్దని ఎమ్మెల్యే డా.పి.వి సిద్దారెడ్డి అన్నారు. మండలంలోని బండ్లపల్లి పంచాయతీలోని బీసీ కాలనీ, బండ్లపల్లి, బండ్లపల్లి ఎస్సీ కాలనీ, పల్లవాండ్లపల్లి, వైఎస్సార్ కాలనీ, ఎగువ ఎస్సీ కాలనీ, బైగారిపల్లి, నాగప్పగారిపల్లి గ్రామాల్లో ఎంపీపీ రఫీనాయక్, మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యేకు మహిళలు హారతులతో స్వాగతం పలికారు. జగనన్న సంక్షేమ పథకాలతో లబ్ధి పొందామని ఆనందం వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల్లో విద్యుత్ పోల్స్, లైన్ మార్పులని పలువురు విన్నవించారు. సీసీ రోడ్లు, పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. పొలాల్లోకి దారి ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే.. వెంటనే సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. గతంలో అబద్ధపు హామీలతో మేనిఫెస్టో తయారు చేసి, ప్రజలను నిలువునా మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. మళ్లీ మోసం చేసేందుకు సిద్ధమవుతున్నాడని తెలిపారు. చంద్రబాబు మాటలు, హామీలను నమ్మి మోసపోవద్దని సూచించారు. దేశంలో ఏ రాష్ట్రంలో ప్రవేశపెట్టనన్ని సంక్షేమ పథకాలు అమలు చేసిన సంక్షేమ సారథి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కులశేఖర్‌రెడ్డి, మాజీ సింగల్‌విండో అధ్యక్షుడు గిరిధర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచులు సూర్యనారాయణ రెడ్డి, పురుషోత్తరెడ్డి, ఫయాజ్ అహమ్మద్, మాజీ ఎంపీటీసీ రాజశేఖర్ రెడ్డి, సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జి డీకే బాబు, సర్పంచ్‌లు టోపీ రమణ, షేక్షావలి, పెద్దినాయుడు, దివాన్‌వలి, ఓబులరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, దివాకర్‌రెడ్డి, వెంకటరమణ, గురివిరెడ్డి, రామచంద్ర, శంకర, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

**గడప గడపకూ సంక్షేమ పథకాలు**

**ధర్మవరం రూరల్:** సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని రావులచెరువులో జెడ్పీ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి తదితరులతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. గ్రామంలోని ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరిందని వైద్య సిబ్బంది ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్యే మరమ్మతు చేయించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సౌజన్య కుమారికి సూచించారు. అదే విధంగా విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయని కాలనీ వాసులు తెలిపారు. వీటి స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని ఆ శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులు ఎంత మంది ఉన్నారు? వారికి సరిపడా ఉపాధ్యాయులు ఉన్నారా? అని ఎంఈఓ సుధాకర్ నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో సౌకర్యాలపై ఉపాధ్యాయులతో ఆరా తీశారు. అదే విధంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని ఆదేశించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

**సచివాలయ ప్రారంభోత్సవం..**

గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులతో కలసి గదులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సచివాలయ ఉద్యోగులు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా బాధ్యతగా విధులను నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ హైమావతి వైస్ ఎంపీపీ చిన్నకృష్ణారెడ్డి, తహసీల్దార్ యోగీశ్వరి దేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నులక రామయ్య, సచివాలయ కన్వీనర్ శ్రీనివాస రెడ్డి, గొట్లూరు సంగాలప్ప, రవీంద్రారెడ్డి, పరందామరెడ్డి, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ సుదర్శన్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు నాగానంద రెడ్డి, రావులచెరువు, యర్రగుంటపల్లి, తిప్పేపల్లి గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

### కర్ణాటక మద్యం స్వాధీనం

**అమడగూరు:** మండలంలోని గొల్లపల్లి సమీపంలో 8 కేసుల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటనారాయణ పేర్కొన్నారు. కర్ణాటక ప్రాంతం బోయపల్లికి చెందిన సురేంద్ర అలియాస్ బెల్లం సూరి కర్ణాటక నుంచి ఆంధ్రాకు మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. 784 టెట్రా ప్యాకెట్లు, వాహనాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు వెల్లడించారు.

### చేపల చెరువు వేలం

**ఎన్పీకుంట:** మండల పరిధిలోని ధనియానిచెరువు సచివాలయంలో బుధవారం సర్పంచ్ దిల్షాద్ అధ్యక్షతన చేపల చెరువుకు వేలం పాట నిర్వహించారు. వేలంలో ఏడుగురు పాల్గొనగా.. డి.కొత్తపల్లికి చెందిన శేఖర్‌రెడ్డి చెరువును దక్కించుకున్నారని పంచాయతీ కార్యదర్శి ఉమారాణి తెలిపారు. పంచాయతీకి రూ.3.69లక్షల ఆదాయం చేకూరిందని పేర్కొన్నారు.

### వైఎస్సార్ బీమా తక్షణసాయం అందజేత

**ధర్మవరం:** పట్టణంలోని చిన్నూరు గ్రామంలో ప్రమాదవశాత్తూ గంటా మల్లికార్జున చెరువులో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద రూ.10 వేల సాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు కౌన్సిలర్ మాసపల్లి సాయికుమార్ అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సంక్షేమ కార్యదర్శి వలిబాషా, వలంటీర్ లోకేష్ పాల్గొన్నారు.

# పండ్ల తోటల సాగుతో ఆదాయం

**పుట్టపర్తి:** పండ్ల తోటల సాగుతో ఆదాయం పొందవచ్చని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. బుధవారం బుక్కపట్నం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఉపాధి ఏపీడీ రఘునాథరెడ్డి, పండ్ల తోటలకు ఎంపికైన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రైతు పండ్ల తోటలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పండ్ల తోటల సాగుకు మన ప్రాంత భూములు అనువుగా ఉన్నాయని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో అన్ని రకాల తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. ఉచితంగా మొక్కలు అందించడంతో పాటు 3 సంవత్సరాల పాటు సంరక్షణకు బిల్లులు చెల్లిస్తోందన్నారు. 5 ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులు అర్హులన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రామకృష్ణారెడ్డి, డ్వామా అధికారి వెంకప్ప, సచివాలయ సిబ్బంది గంగాధర్, సుధాకర్ పాల్గొన్నారు.



తాడిమర్రి: రైతులకు సూచనలిస్తున్న డ్వామా ఏపీడీ వెంకటాచలపతి

**తాడిమర్రి:** పండ్ల తోటల సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని డ్వామా ఏపీడీ వెంకటాచలపతి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్, ఉద్యానవన శాఖ సంయుక్తంగా రైతులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 114 మంది రైతులు 304 ఎకరాల్లో చీనీ, మామిడి చెట్లు పెంచడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సంజీవ రెడ్డి, హెచ్ఓ అమరేశ్వరి, ఈసీ అశోక్ కుమార్‌రెడ్డి, ప్లాంటేషన్ సూపర్ వైజర్ అరుణమ్మ పాల్గొన్నారు.

**నల్లమాడ:** ఉపాధి హామీ పథకం కింద రైతులు మేలు రకాల పండ్ల మొక్కలు సాగు చేసుకోవాలని అధికారులు సూచించారు. మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీడీఓ కొండన్న అధ్యక్షతన బుధవారం పండ్ల తోటల రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ దుంగావత్ సునీతాబాయి, వైస్ ఎంపీపీ కే.సూర్యనారాయణ హాజరై రైతులకు సూచనలు, సలహాలిచ్చారు. రైతులు విరివిగా పండ్లతోటల పెంపకం చేపట్టాలని సూచించారు. రింగ్ ట్రెంచ్‌ల ఏర్పాటు, పూల మొక్కల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

# అధైర్యపడొద్దు.. అండగా ఉంటా

**నల్లమాడ:** అధైర్యపడొద్దు..అండగా ఉంటానంటూ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పలువురు బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మండలంలోని కొండ్రవారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మద్దిరెడ్డి రామకృష్ణారెడ్డి భార్య ఎం.రంగమ్మ(73) అనారోగ్యంతో కొద్ది రోజుల క్రితం మృతి చెందింది. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి బుధవారం గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కురుమాలలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ సింగిల్ విండో డైరెక్టర్ వెంకట్రాముడు, నజీర్, మణి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనారోగ్యంతో బాధపడుతూ శస్త్రచికిత్స అనంతరం ఇంటివద్ద కోలుకొంటున్న కేశప్పను పరామర్శించారు. ఆయా కుటుంబాలకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తనవంతు ఆర్థికసాయం అందించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకుడు కే.రవిచంద్రారెడ్డి ఇంటికి వెళ్లి ఆయన్ను పలకరించారు. పక్షవాతానికి గురైన వంకరకుంటకు చెందిన మాజీ డీసీఎంఎస్ చైర్మన్ టి.కేశవరెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, సీనియర్ నాయకులు పీవీ భాస్కర్‌రెడ్డి, టీడీ విజయశేఖర్ రెడ్డి, అరవిందరెడ్డి, రిటైర్డ్ వీఆర్ఓ కేశవరెడ్డి, సర్పంచ్ లింగమూర్తి, మార్కెట్ యార్డు డైరెక్టర్ శంకర, నాయకులు సుధాకర్ రెడ్డి, రెడ్డెప్ప, రాజారెడ్డి, లింగం, నారాయణస్వామి, ఈశ్వరయ్య తదితరులున్నారు.



రామకృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

**సన్మానం..**

**నల్లమాడ:** వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం మండల కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన చిన్న నాగప్ప బుధవారం నల్లసింగయ్యగారిపల్లిలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను పూలమాలతో సత్కరించారు. పార్టీ అభ్యున్నతికి చురుగ్గా పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుళ్లాయప్ప, నాయకులు ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బక్రీద్ శుభాకాంక్షలు





ఎమ్మెల్యేలు సిద్దారెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

**కదిరి అర్బన్/ఆత్మకూరు:** ముస్లింలకు ఎమ్మెల్యేలు డా.పీవీ సిద్దారెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి బుధవారం వేర్వేరు ప్రకటనల్లో బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, సహనం, బక్రీద్ పండుగ ఇచ్చే సందేశాలన్నారు. అల్లాహ్ ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

### సీఎం జగన్‌తోనే బలహీన వర్గాల అభివృద్ధి



ఆర్థికసాయం అందజేస్తున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

**తాడిమర్రి:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే దళిత, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణా రెడ్డి పేర్కొన్నారు. బుధవారం డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డితో కలసి తాడిమర్రిలో రెండో రోజు గుడ్‌మార్నింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఇటీవల అగ్నిప్రమాదంలో కాలిపోయిన కూల్‌డ్రింక్ షాపు యజమాని దిమ్మగుడి అల్లాబకాష్‌కు రూ.20 వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు పొరాళ్ల విజయభాస్కర్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రామాంజనేయులు, సచివాలయాల మండల కన్వీనర్ సాయినాథ్‌రెడ్డి, ఉప సర్పంచ్ రమణారెడ్డి, మాధవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కె.విశ్వనాథ్, ఓబులేసు, మారక శివారెడ్డి, శీన పాల్గొన్నారు.

# సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

**ధర్మవరం రూరల్:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ పక్కల రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ధర్మపురి గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఏ చిన్న పనికైనా మండలానికి వెళ్లాల్సి వచ్చేదన్నారు. దీంతో సమయం, డబ్బు రెండు వృథా అయ్యేవన్నారు. పాదయాత్రలో వైఎస్ జగన్ ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి గ్రామ స్థాయిలోనే సమస్యలు పరిష్కారమయ్యేలా సచివాలయ వ్యవస్థకు రూపకల్పన చేశాడన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా గ్రామస్థాయిలోనే సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్నారు. పేద ప్రజల కోసం నిరంతరం శ్రమించే మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి సీఎం చేయాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. సర్పంచ్ సాయి ప్రసన్న, తహసీల్దార్ యోగీశ్వరిదేవి, ఎంపీడీఓ సౌజన్యకుమారి, కార్యదర్శి యల్లప్ప, ప్రభాకర్ రాజు పాల్గొన్నారు.



సర్పంచ్‌తో కలిసి సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

# 'జన్మభూమి కమిటీ పేరుతో టీడీపీ దోచుకుంది'

**తనకల్లు:** టీడీపీ అధికారంలో ఉన్న 14 ఏళ్లు ఆ పార్టీ నాయకులు అడ్డంగా ప్రజా ధనాన్ని దోచుకుతిన్న సంగతి ఇంకా ప్రజలు మరచిపోలేదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి ధ్వజమెత్తారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు దేశాయి సంజీవ రెడ్డి మిషన్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. టీడీపీ 14 ఏళ్లలో చేయలేని అభివృద్ధిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లలో చేసి చూపించారన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఇచ్చిన మాట ప్రకారం ప్రతి హామీని అమలు చేసిన మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని తెలిపారు. మండల అభివృద్ధికి ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మారుమూల గ్రామాలకు తారు రోడ్లు వేయించారని తెలిపారు. ఎమ్మెల్యే కృషితో మండలంలో దాదాపు రూ. 50 కోట్లతో రోడ్లు పూర్తి చేశామన్నారు. 17 గ్రామాలకు తారురోడ్లు, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు వేయించామన్నారు. 15 గ్రామాలకు త్వరలో రోడ్డు పనులు ప్రారంభం అవుతాయని వెల్లడించారు. మరో 10 గ్రామాలకు రోడ్లు మంజూరైనట్లు వివరించారు. మండలంలోని 37 ప్రభుత్వ పాఠశాలల్లో రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. రోడ్లు, అభివృద్ధిపై మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బహిరంగ చర్చకు తాము సిద్ధమన్నారు. టీడీపీ నాయకులు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. దమ్ము, ధైర్యం ఉంటే టీడీపీ నాయకులు సవాల్ స్వీకరించాలన్నారు. ప్రభుత్వంపై అనవసర విమర్శలు చేయకుండా మండలాభివృద్ధికి సహకరించాలని హితవు పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణారెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామ్‌దేశాయ్, కో-ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, నాయకులు శ్రీనివాసులు నాయుడు, దేశాయి భక్తవత్సలరెడ్డి, నీలకంఠారెడ్డి, పోలం సిద్దారెడ్డి, బీసీ నాయకులు రమణ, ఈశ్వరప్ప, బాల్‌రెడ్డి, నరసింహారెడ్డి, ఎస్సీ నాయకులు శ్రీనివాసులు, చంద్ర, తిమ్మయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, తదితరులు

# చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలి

**పుట్టపర్తి అర్బన్:** చిరుధాన్యాల సాగును మండల వ్యాప్తంగా పెంచేలా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఏవీ రమణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీనరసమ్మ, వైస్ ఎంపీపీలు హనుమంతరెడ్డి, రంగన్న, ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. ప్రజలకు అందించే పథకాలతో పాటు అభివృద్ధిపై ఆయా శాఖలు తీసుకుంటున్న చర్యలను వివరించారు. వ్యవసాయాధికారి వెంకట బ్రహ్మం మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులకే పంట నమోదు చేస్తారన్నారు. ఈ ఏడు నూతన విధానంలో ప్రతి సర్వే నంబర్‌ను అనుసంధానం చేసి పంట నమోదు చేస్తారన్నారు. జూలై నుంచి పంటల నమోదు చేస్తారని.. ఆగస్టుకు నమోదు పూర్తవుతుందన్నారు. ఉలవ పంటకు మాత్రం సాగైన తరువాత చేయవచ్చన్నారు. పీఎం కిసాన్ కోసం ఇంకా 600 మంది రైతులు ఈ-కేవైసీ చేయించుకోలేదన్నారు. 50 శాతం సబ్సిడీతో విత్తన రాగులు అందజేస్తామన్నారు. వంద కిలోల రాగులు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటి పూర్తి ధర రూ.134 కాగా ప్రభుత్వం సబ్సిడీతో రూ.67కే అందజేస్తుందన్నారు. కొర్రలు ఉచితంగా అందజేస్తామన్నారు. జూలై 8వ తేదీ వైఎస్సార్ జయంతిని పురస్కరించుకొని రైతు దినోత్సవంను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు కల్పిస్తోందన్నారు. ఉపాధి పనులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



శాఖల వారీగా సమీక్షిస్తున్న దృశ్యం

# సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'

**చెన్నేకొత్తపల్లి/ప్రశాంతి నిలయం/గాండ్లపెంట/నల్లచెరువు/కనగానపల్లి:** పుట్టపర్తి మున్సిపాలిటీలో జగనన్న సురక్ష సర్వే బుధవారం ప్రారంభమైంది. మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి,వైస్ చైర్మన్ తిప్పన్న, మున్సిపాలిటీ సచివాలయాల కన్వీనర్ సూర్యా గౌడ్,కౌన్సిల్ భాస్కర్ రెడ్డి తదితరులు ఇంటింటికీ వెళ్లి పథకాల వివరాలను తెలుసుకున్నారు. గాండ్లపెంట, మలమీదపల్లి సచివాలయాల్లో శుక్రవారం జేసీఎస్ కన్వీనర్ గజ్జలరవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఎంపీపీ జగన్మోహన్, కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, మాజీ జడ్పీటీసీ భాస్కరరెడ్డి పాల్గొన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించాలని నల్లచెరువు తహసీల్దార్ ఎస్.రవికుమార్ అధికారులను ఆదేశించారు. చెన్నేకొత్తపల్లి న్యామద్దల గ్రామాల్లో వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమావేశాలు నిర్వహించారు. ఎంపీడీఓ గంగావతి, జెడ్పీటీసీ గోవిందరెడ్డి, ఈఓఆర్‌డీ అశోక్‌నాయక్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ పవన్‌కుమార్‌రెడ్డి, జగనన్న సురక్ష మండల ఇన్‌చార్జ్ అనిల్‌రెడ్డి పాల్గొన్నారు. కనగాపల్లి మండలంలోని యలకుంట్ల, దాదులూరు, ముక్తాపురం గ్రామాల్లో జగనన్న సురక్ష సర్వే జరిగింది. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, యూత్ కన్వీనర్ అశోక్ పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**చెన్నేకొత్తపల్లి:** రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలైన సంఘటన మండల పరిధిలోని కోన కన్యాశ్రమం వద్ద బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీధర్ వివరాల మేరకు... నరసింహరాయనిపల్లికి చెందిన శ్రీనివాసులు, వెల్దుర్తికి చెందిన సాయి ద్విచక్ర వాహనంపై కొనకన్యాశ్రమం వైపు నుంచి వెళ్తున్నారు. 44వ జాతీయ రహదారి వై జంక్షన్ దాటుతుండగా బెంగళూరు వైపు వెళుతున్న కారు ఢీ కొట్టింది. దీంతో వారికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

**ఉపాధ్యాయులకు సన్మానం**

**కనగానపల్లి:** మామిళ్లపల్లి కేఆర్ఆర్ జిల్లా పరిషత్ పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను గ్రామస్తులు, ఉపాధ్యాయులు సన్మానించారు. స్థానిక పాఠశాలలో బుధవారం హెచ్ఎం స్నేహలత ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు విజయలక్ష్మి, రామచంద్ర, సుధారాణి, వాసంతీలను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

### పెట్టుబడి సాయం పెంచాలి

**కనగానపల్లి:** ప్రభుత్వం రైతు భరోసా కింద అందించే పెట్టుబడి సాయం ఎకరానికి రూ.10 వేలకు పెంచాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాటమయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రం కనగానపల్లిలో బుధవారం మండల రైతు సంఘం నాయకులతో కలసి రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి జేవీ రమణ, గౌరవాధ్యక్షులు మహదేవ, గోవిందు, నాగరాజు, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

### విద్యతోనే ఉజ్వల భవిష్యత్

**పుట్టపర్తి:** విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సహకార సంఘం అధ్యక్షుడు రమణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మారాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం జరిగింది. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన రోహిణి, సాఫియా, చరణ్ కుమార్‌కు నగదు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థులు బాగా చదువుకుని భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్‌కుమార్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ చాప్లానాయక్ వైస్ చైర్మన్ సోముశేఖర్ పాల్గొన్నారు.

## అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

**నల్లమాడ:** ఓటరు జాబితా తయారీలో బూత్ లెవల్ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని తహసీల్దార్ దేవేంద్రనాయక్ ఆదేశించారు. ఓటరు జాబితా తయారీపై బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ కందే నరసింహులు, సూపర్‌వైజర్స్ డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున, అంజన సూచనలిచ్చారు. జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకూ బూత్ లెవల్ అధికారులు ఇంటింటా పరిశీలన చేపట్టాలన్నారు. ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 29 వరకూ పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, ఈపీ రేషియో, జెండర్ రేషియో, డబుల్ ఓటర్లు, మృతి చెందిన, శాశ్విత బదిలీ ఓటర్ల తొలగింపు చేయాలన్నారు. ఓటరుగా నమోదు చేసుకునేందుకు యువతకు అవగాహన కల్పించాలన్నారు. 18, 19 తేదీల్లో బూత్ స్థాయిల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు.

**ఎన్పీకుంట:** ఓటరు నమోదును బీఎల్ఓలు ముమ్మరంగా చేపట్టాలని తహసీల్దార్ నరేంద్రకుమార్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వీఆర్ఓలు, బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలియజేయాలన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ రవినాయక్, ఎలక్షన్ సీఓ వెంకట్ పాల్గొన్నారు.